వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 341
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
అక్టోబర్ 30, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



# బాధితులకు రాకేష్ రెడ్డి అండ

□ ముంపు ప్రాంతాల్లో పర్యటన

8లో..



# ముంచిన మొంథా

- నిరాశ్రయులైన వేలాది కుటుంబాలు
- బంధువుల ఇండ్లలో, పునరావాస కేంద్రాల్లో బాధితులు
- నిత్యావసరాలు వర్షార్పణం
- వర్షం తగ్గినా జలదిగ్బంధంలోనే నగరం
- హనుమకొండ-వరంగల్ కు రాకపోకలు బంద్
- ముంపు ప్రాంతాల్లో మంత్రి సురేఖ పర్యటన
- సహాయక చర్యల్లో పాల్గొన్న కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్య శారద, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్






వివరాలు2లో..

లచ్చక్క.. మీ ఇల్లు మునిగిందా.. ఇంట్లోకి నీళ్లొచ్చాయా అంటూ ఒకరు పలకరిస్తే బాబాయ్.. మీ ఇల్లు కూడా మునిగిందా.. రాత్రంతా ఎక్కడ తలదాచుకున్నారు.. ఇంట్లో వస్తువులన్నీ తడిశాయా అంటూ మరొకరు.. ఇంటి ముందు పెట్టిన బైక్ నీటిలో మునిగి స్టార్ట్ కావడం లేదంటూ ఇంకొకరు ఇలా ఎక్కడ ఓ నలుగురు కలిసినా ఇవే ముచ్చట్లు.. కన్నీటి గాథలే నగరంలో దర్శనమిస్తున్నాయి. బియ్యం, ఉప్పు, పప్పు, ఇతర నిత్యావసరాలు వర్షార్పణం అయ్యాయి. కట్టుబట్టలతో రోడ్డుపై నిలబడిన దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. గుండెలవిసేలా విలపిస్తున్న సంఘటనలే కనిపిస్తున్నాయి. నగరంలోని వేలాదిమంది రెక్కాడితేకాని డొక్కాడని కార్మికులు, గుడిసె వాసులను మొంథా తుఫాన్ నిండా ముంచింది. సర్వం కోల్పోవడంతో పచ్చడి మెతుకులు కూడా దొరకడం వారికి కష్టంగా మారింది. ఎవరిని పలకరించినా తమ దీన గాథలే చెప్పకొంటున్నారు. అయితే ఎప్పటిలాగే రాజకీయ నాయకుల పరామర్శలు షరా మామూలే అన్నట్లుగా సాగుతున్నాయి. బిక్కమొఖం పెట్టి ఆందోళన వద్దు అండగా ఉంటామంటూ హామీలిస్తున్నారు. ఇంటికో ఆహారపు పొట్లం ఇచ్చి ఏదో పొడిచినట్లు ఫొటోలకు ఫోజులిస్తున్నారు. మరో సారి ఇలాంటి ఉపద్రవం రాకుండా చర్యలు చేపడతామంటూ అరిగిపోయిన రికార్డు హామీని తిరిగి ఇస్తున్నారు. ఏది ఏమైనా నగరం ముంపుకు గురికావడంలో 50 శాతం తప్పు అధికారులదైతే మరో సగం తప్పు పాలకులదనే చెప్పవచ్చు.

- వరంగల్ వాయిస్ బృందం



8లో..

# అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ | ముంపు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పర్యటన | డ్రోన్ ద్వారా ఆహార పదార్థాల పంపిణీ



# రేపు సీఎం ఏరియల్ సర్వే

మొంథా తుఫాను ప్రభావంతో వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో దెబ్బతిన్న ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గురువారం నిర్వహించాల్సిన వరంగల్ పర్యటనను వాయిదా వేసుకున్నారు. తుఫాను ప్రభావిత జిల్లాల్లో ఇంచార్జి మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సీఎం ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటూ వారి అవసరాలు తీర్చాలన్నారు. ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఇందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. - వరంగల్ వాయిస్, వరంగల్



# ముంచిన 'మొంథా'

- నిరాశ్రయులైన వేలాది కుటుంబాలు
- బంధువుల ఇండ్లలో, పునరావాస కేంద్రాల్లో బాధితులు
- నిత్యావసరాలు వర్షార్పణం
- వర్షం తగ్గినా జలదిగ్బంధంలోనే నగరం
- హనుమకొండ–వరంగల్ కు రాకపోకలు బంద్
- ముంపు ప్రాంతాల్లో మంత్రి సురేఖ పర్యటన
- సహాయక చర్యల్లో కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్య శారద, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**వరంగల్ వాయిస్ బృందం :** వర్షం తగ్గినా ఇంకా జలదిగ్బంధంలోనే నగరంలోని పలు కాలనీలు ఉన్నాయి. వరంగల్ లోని ప్రధాన రహదారులు సైతం చెరువులను తలపిస్తున్నాయి. హనుమకొండలో ఎక్కడ చూసినా నీళ్లే.. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నీట మునిగిన పలు కాలనీలు.. ముంపు ప్రాంతాలే దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారులపై కూడా నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాజీపేట, హనుమకొండ ప్రాంతాలనుంచి వరంగల్ కు రాకపోకలు బంద్ కాగా వరంగల్ సిటీతో అండర్ రైల్వేగేట్ ప్రాంతానికి పాక్షికంగా సంబందాలు తెగిపోయాయి. వరంగల్ నగరంలో 30 కాలనీలు, హనుమకొండలో 15 కాలనీలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి.

## ఉప్పొంగిన బొందివాగు..

భారీ వర్షానికి వరంగల్ నగరం జలదిబ్బంధంలో చిక్కుకుంది. వరంగల్–హనుమకొండను అనుసంధానం చేసే హంటర్ రోడ్డులో బొంది వాగు ఉప్పొంగడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ములుగు రోడ్డు వద్ద నాలా ఉధృతంగా ప్రవహించడంతో వరంగల్–హనుమకొండకూ రాకపోకలు నిలిచిపోయాయి. సంతోషిమాత కాలనీ, డీకే నగర్, ఎన్ఎన్ నగర్, మైసయ్య నగర్, సమ్మయ్య నగర్, సంతోషిమాత కాలనీ, సాయి గణేష్ కాలనీలోని ఇళ్లలోకి వరద నీరు పెద్దఎత్తున వచ్చి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## జలదిగ్బంధంలో విద్యార్థులు..

హంటర్ రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆశ్రమ పాఠశాలకు చెందిన 470 మంది విద్యార్థినులు జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. రాత్రి నుంచి సహాయం కోసం ఎదురుచూపులు చూశారు. దీంతో గురువారం మధ్యాహ్నం రెస్క్యూ టీం విద్యార్థినులకు పడవల ద్వారా బయటికీ తీసుకురాదా వారిని ఆర్టీసీ బస్ లో షెల్టర్ కు తరలించారు. అయితే పోతన రోడ్డులో ప్రయాణిస్తున్న రెండు కార్లు నీటిలో పూర్తిగా మునిగిపోయాయి. దీంతో కార్లలో ఉన్న ప్రయాణికులు సహాయం కోసం ఎదురు చూపులు తప్పలేదు.

## మార్కండేయ కాలనీలో..

భారీ వర్షాలకు బుధవారం రాత్రి వరంగల్ తూర్పు నియోజకవర్గం 12వ డివిజన్ మార్కండేయ కాలనీ పక్కన ఉన్న నాలలోకి భారీగా వరద నీరు చేరుకుంది. కాలనీ బ్రిడ్జి దగ్గర చెత్త, చెదారం అడ్డుగా ఉండడంతో వరద నీరు కాలనీని ముంచెత్తింది. కాలనీ రోడ్లు అన్ని జలమయం అయ్యాయి. దీంతో స్పందించిన స్థానిక కార్పొరేటర్ కావటి కవితా రాజు యాదవ్ హుటాహుటిన సూపర్ వైజర్ భాస్కర్, శానిటరీ ఇన్ స్పెక్టర్ రమేష్, జవాన్ శంకర్, ప్రదీప్ ను పంపించి జేసీబీతో అడ్డుగా ఉన్న చెత్తని తొలగించారు. దీంతో వరద నీరు కాలనీలోకి రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది

## ముంపు ప్రాంతాలను పరిశీలించిన సీపీ..

హనుమకొండ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన ప్రాంతాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం సందర్శించారు. ట్రాక్టర్ పై పలు ప్రాంతాల్లో తిరిగారు. ఈ సందర్భంగా పలు కాలనీలలో గృహ నిర్బంధంలో ఉన్న ప్రజల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ ఉండాలన్నారు. అధికారులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే స్పందించాలని కోరారు.

## 1.4 లక్షల ఎకరాల్లో పంటనష్టం..

మొంథా తుఫాను ప్రభావంతో 1,696 గ్రామాల్లోని 1.4 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 90 వేల ఎకరాల్లో వరి, 23 వేల ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. తుపాను వల్ల 11 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం జరిగిందన్నారు. సుమారు 75 వేల మంది రైతులకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. 95 మండలాల్లోని 292 గ్రామాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. అనేక ప్రాంతాల్లో పంచాయతీరాజ్ రోడ్లు, వంతెనలు, కల్వర్టులు ధ్వంసం అయ్యాయి. తుపాను ప్రభావంతో సుమారు 1,800 కి.మీ. మేర ఆర్ అండ్ బీ రోడ్లు ధ్వంసం అయినట్లు అంచనా వేశారు. దీని ద్వారా సుమారు రూ.వెయ్యి కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా. అదే విధంగా విద్యుత్, నీటిపారుదల, హౌసింగ్ శాఖలకు తీవ్ర నష్టం జరిగిందని అధికారులు ప్రకటిస్తున్నారు.



















# పరమ పవిత్రం కార్తీక మాసం

■ అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి

**వరంగల్ వాయిస్, గణపురం:** కార్తీక మాసం ఎంతో పరమ పవిత్రమైనదని భూపాలపల్లి అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. కార్తీక మాస ఉత్సవాలలో భాగంగా గురువారం ఆమె కోటగుళ్ళలోని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు ఆమెను సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం, అడిషనల్ కలెక్టర్ ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరుని





వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం కూడా కోటగుళ్ళలో కార్తీక పూజలు నిర్వహించామని, ఈ సంవత్సరం కూడా స్వామివారిని దర్శించుకోవడం, పూజలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు ఆమెకు ఆశీర్వచనాలు పలికి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీఓ శ్రీనివాస్ తదితర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**బీఆర్ఎస్ నాయకుడు దుబాసి నవీన్ డిమాండ్**



**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలోని గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ ఈదురు గాలులు, అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు దుబాసి నవీన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ మండలంలో వరి, పత్తి పంటలు సుమారు 5 వేల ఎకరాల్లో నేలకు ఒరిగి తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. దీని కారణంగా ధాన్యం తాలుగా మారిపోయిందని, ఎకరాకు కనీసం పది బస్తాల దిగుబడి రావడం కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో అన్ని గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో నష్టపోయిన పంటలను సర్వే చేయించాలని ఆయన కోరారు. దెబ్బతిన్న ప్రతి ఎకరాకు రూ. 20 వేల చొప్పున నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, నష్టపోయిన రైతులతో కలిసి ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని నవీన్ హెచ్చరించారు.

## సేంద్రియ ఉత్పత్తులతోనే సంపూర్ణ ఆరోగ్యం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గోఆధారిత, సహజ సిద్ధంగా పండించిన ఉత్పత్తుల వాడకం మన ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని సామాజికవేత్త, మిల్లెట్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ అన్నారు. ఈ ఉత్పత్తులు మనకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తాయని ఆయన ఉద్ఘాటించారు. నవంబర్ 1, 2 తేదీల్లో (శని, ఆదివారాలు) పబ్లిక్ గార్డెన్, నేరెళ్ల వేణుమాధవరావు కళా ప్రాంగణంలో నిర్వహించనున్న న్యాచురల్, సేంద్రీయ రైతుల సంతకు సంబంధించిన వివరాలతో కూడిన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంత ముఖ్య నిర్వాహకులు భయ్య సారయ్య మరియు చిన్నాల అనిత తదితరులు పాల్గొన్నారు. సంత ముఖ్య నిర్వాహకులు సారయ్య మాట్లాడుతూ జిల్లాలో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న రైతులు పండించిన నాణ్యమైన ఉత్పత్తులను నగర ప్రజలకు పరిచయం చేయడమే ఈ సంత ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ రెండు రోజుల పాటు ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. మహిళా రైతు చిన్నాల అనిత మాట్లాడుతూ ఈ సంతను ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రికార్డ్ మిల్లెట్ హబ్ అధ్యక్షులు కుసుమ సురేష్, కృష్ణ ప్రసాద్ శివరంజని దంపతులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ సవరణతోనే బీసీలకు రిజర్వేషన్లు

■ బోనగాని యాదగిరి గౌడ్

**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** తరాలు మారినా బీసీల తలరాతలు మారడం లేదని, దేశంలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు సామాజిక న్యాయం జరగాలంటే తప్పనిసరిగా రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా వైస్ చైర్మన్ బోనగాని యాదగిరి గౌడ్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, నూతనంగా బీసీ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ గా నియమితులైన జాజుల శ్రీనివాస్ గౌడ్‌ను బోనగాని యాదగిరి గౌడ్ నేతృత్వంలోని బీసీ నాయకుల బృందం హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమ సంఘం కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయింది. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ బృందంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనగాని యాదగిరి గౌడ్ తో పాటు గోపా హనుమకొండ జిల్లా అధ్యక్షులు చిర్ర రాజు గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు రరేష్ గౌడ్, బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మనిమంజరి, బీసీ మహిళా సంఘం నాయకులు పోశాల పద్మ గౌడ్ పాల్గొన్నారు.అనంతరం యాదగిరి గౌడ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 79 సంవత్సరాలు పూర్తయినా బీసీలు ఓట్లు వేసే యంత్రాలుగాను, జెండాలు మోసే కార్యకర్తలుగానే మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపదను సృష్టించే 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఆ సంపదలో వాటాను పంచుకోలేకపోవడం బాధాకరమన్నారు. దీనికి చట్టసభలలో బీసీలకు



రిజర్వేషన్లు లేకపోవడమే మూల కారణమన్నారు. దేశవ్యాప్తంగా విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థలతో పాటు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో సైతం బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు దక్కాలంటే తప్పనిసరిగా రాజ్యాంగ సవరణ జరగాలని ఆయన స్పష్టం చేశారు. "మేమెంతో మాకంత వాటా" నినాదంతో బీసీ సోదరులంతా రిజర్వేషన్ల సాధనకై పోరుబాట పట్టాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ జేఏసీ ఇచ్చే ప్రతి కార్యాచరణలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సోదరులను కలుపుకొని మరో స్వాతంత్ర్య పోరాటాన్ని మించిన పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, బీసీ ప్రధానిగా చెప్పుకుంటున్న నరేంద్ర మోడీ గారు బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు తక్షణమే రాజ్యాంగ సవరణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఉధృతంగా మానేరు పరవళ్లు



**వరంగల్ వాయిస్, మల్హర్:** తుఫాను ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు వాగులు, చెరువులు నిండు కుండను తలపిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు భారీ వరద రావడంతో పాటు, కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యామ్ గేట్లు తెరవడంతో మండలంలోని పీవీ నగర్ సమీపంలో ఉన్న మానేరు నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వరద ఉధృతి కారణంగా, మానేరు నది పరివాహక ప్రాంతంలోని రైతుల వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు, పైపులు నదిలో కొట్టుకుపోయాయి. దీనితో రైతులకు నష్టం వాటిల్లింది. నది ప్రవాహం ఎక్కువగా ఉన్నందున, పశువుల కాపరులు, చేపల వేటకు వెళ్లేవారు, రైతులు నది వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు నదికి దూరంగా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు.


## నూతన వధూవరులను ఆశీర్వదించిన చల్లా



**వరంగల్ వాయిస్, పరకాల:** మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి రెండు వేర్వేరు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. పరకాల పట్టణంలోని ఎంఎన్ రావు గార్డెన్స్ లో జరిగిన నడికూడ మండలం వరికోల్ గ్రామ బీఆర్ఎస్ నాయకుడు పోశాల అశోక్ గౌడ్ – రజిత దంపతుల కుమార్తె మనూష, శ్రీకాంత్ గౌడ్ ల వివాహ వేడుకలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి హైదరాబాద్‌లోని శ్రీ పళని కన్వెన్షన్ లో జరిగిన మరో వివాహ వేడుకకు హాజరయ్యారు. నడికూడ మండలం ధర్మారం వాస్తవ్యులు ఇంటి అరుణాదేవి–తిరుపతి రెడ్డి దంపతుల కుమారుడు సుమంత్ రెడ్డి, సాయిని రెడ్డిల వివాహ మహోత్సవంలో పాల్గొని, నూతన జంటను ఆశీర్వదించారు.

## తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలి

**బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్**



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** మొంథా తుఫాను ప్రభావంతో కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు వరంగల్, హనుమకొండ జంట నగరాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై అధికారులు తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాదారపు శివకుమార్ డిమాండ్ చేశారు. తుఫాను ప్రభావం మరో మూడు రోజులు ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివసిస్తున్న ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి అవసరమైన అన్ని వసతులను కల్పించాలని ఆయన కోరారు. వర్షాల కారణంగా రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని శివకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. "ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం ఎక్కడా బాగుపడలేదు" అనే చందంగా రాష్ట్రంలో రైతుల దయనీయ స్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, వెంటనే అన్ని గ్రామాల్లో ఐకేపీ సెంటర్లను ప్రారంభించి, వర్షానికి తడిచి ముద్దయిన, మొలకెత్తిన వరి ధాన్యం, మొక్కజొన్నను ఆలస్యం చేయకుండా కొనుగోలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఉన్న శ్రద్ధ ప్రజలపైనా, రైతులపైనా లేదని శివకుమార్ నిప్పులు చెరిగారు. జూబ్లీహిల్స్ ప్రజలు తమ తీర్పు ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని ఆయన హెచ్చరించారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, అక్టోబర్ 30, 2025

# అకాల వర్షం.. తీవ్ర పంట నష్టం

■ బోరున విలపిస్తున్న రైతన్నలు

**వరంగల్ వాయిస్, ఆత్మకూర్:** మొంథా తుఫాన్ ప్రభావంతో ఆత్మకూర్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షాల వల్ల వరి పంటలు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంటలు నేలరాలడం, ధాన్యం తడిసిపోవడం వంటి కారణాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆరుగాలం శ్రమించి, అప్పులు చేసి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో ఇలా అకాల వర్షం వల్ల నష్టం వాటిల్లడంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలకు, ఈదురు గాలులకు కోతకు వచ్చిన వరిపైరు పూర్తిగా నేలకొరిగింది. పది రోజుల్లో చేతికి వచ్చే పంట నేలమట్టం కావడంతో రైతులు బోరున విలపిస్తున్నారు. నేలకొరిగిన పంటను కోయడానికి హార్వెస్టర్‌కు ఎక్కువ సమయం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు దిగుబడి తగ్గి, ఉన్న పంటను వర్ష ప్రభావం నుంచి కాపాడుకోవడానికి నానా కష్టాలు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఇదివరకే కురిసిన వర్షాలకు పత్తి పంట పూర్తిగా దెబ్బతినగా, ఈ తుఫాను తాకిడితో వరి కూడా నేలమట్టం కావడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో



పడిపోయారు. కష్టానికి తగిన ప్రతిఫలం దక్కక, పెట్టుబడి కూడా నష్టపోవడం రైతులను కలచివేస్తోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి, నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందించాలని రైతులు, అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, నష్టం అంచనా వేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## రైతులను తక్షణమే ఆదుకోవాలి

### బీజేపీ మండల అధ్యక్షుడు రాజ్ కుమార్ గౌడ్



**వరంగల్ వాయిస్, పరకాల:** మొంథా తుఫాన్ ప్రభావంతో పరకాల మండలంలోని అన్ని గ్రామాల్లో కురిసిన ఎడతెరిపిలేని భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీజేపీ పరకాల మండల పార్టీ అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. తుఫాను వల్ల మండలంలో వరి పంట, పత్తి, మొక్కజొన్న, మరియు కోసి ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు. నష్టపోయిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రకృతి విపత్తు సమయంలో మండలంలోని ప్రజలకు ఏ సమస్యలు ఉన్నా, బీజేపీ కార్యకర్తలు అందరూ వారికి అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందించాలని కాసగాని రాజ్ కుమార్ గౌడ్ పార్టీ కార్యకర్తలకు సూచించారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల:** మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఇటీవల మృతి చెందిన ఇద్దరు బీఆర్ఎస్ నాయకుల కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరకాల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఏకు కార్తీక్ తండ్రి ఏకు శంకర్ ఇటీవలే మృతిచెందారు. నేడు ధర్మారెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా, పరకాల మండలం కామారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బరిగేల రాజయ్య అనారోగ్యంతో మృతిచెందగా, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వారి కుటుంబాన్ని కూడా పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కూలిన బాక్స్ డ్రైన్ పరిశీలన



**వరంగల్ వాయిస్, వరంగల్:** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కూలిపోయిన బాక్స్ డ్రైన్‌ను వెంటనే తొలగించి, నూతనంగా నిర్మాణం చేపట్టాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులను కోరారు. గత 30 సంవత్సరాల క్రితం నిర్మించిన ముకుంద కాలనీ, కొత్త కుమ్మరవాడ మధ్య గల బాక్స్ డ్రైన్, వర్ష ప్రభావం వల్ల కూలిపోయిందని కార్పొరేటర్ రవి తెలిపారు. కూలిన సిమెంట్ పెద్దలు డ్రైన్‌లో అడ్డుగా ఉండటం వలన వర్షపు నీరు, మురుగు కాలువ నీరు ఎస్టీపీ వైపు వెళ్లకుండా పక్కన ఉన్న ఇళ్లలోకి ప్రవేశించి ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించారు. ఈ సమస్యను వరంగల్ మహానగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కు కార్పొరేటర్ మరుపల్ల రవి తెలియజేశారు. దీనిపై వారు వెంటనే స్పందించి, అధికార బృందాన్ని పంపారు. జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్ విభాగం నుంచి ఈఈ సంతోష్, డీఈలు రంగనాథ్, సతీష్, ఏఈ హబీబ్ సంఘటనా స్థలానికి వచ్చి పడిపోయిన డ్రైన్‌ను పరిశీలించారు. ఈఈ సంతోష్ మాట్లాడుతూ డ్రైన్‌లో పడిన సిమెంట్ పెద్దలను త్వరలో తొలగిస్తామని తెలిపారు. నూతనంగా బాక్స్ డ్రైన్ నిర్మాణం చేపట్టడానికి అవసరమైన ప్రణాళికలు త్వరలోనే తయారు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి సుధాకర్, స్థానిక నాయకులు ఎలుగుల మానస, అంజలి, గీత, రాజమ్మ, నాంపల్లి అశోక్, ఎలుగుల కనకరాజు, ఎలగందుల లక్ష్మీనారాయణ, జవాన్ ఆదామ్ తదితరులు పాల్గొన్నారు.

## కంఠాత్మకూర్ బ్రిడ్జి వైపు వెళ్లొద్దు

### ప్రయాణికులకు దామెర ఎస్సై అశోక్ సూచన



**వరంగల్ వాయిస్, దామెర:** భారీ వర్షాల కారణంగా కంఠాత్మకూర్ గ్రామంలోని బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దామెర ఎస్సై కొంక అశోక్ హెచ్చరించారు. గురువారం ఆయన బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహాన్ని స్వయంగా పరిశీలించారు. ప్రజలు అధిక నీటి ప్రవాహం ఉన్న బ్రిడ్జి వైపు వెళ్లకూడదని ఎస్సై అశోక్ స్పష్టం చేశారు. అలాగే, వాగు ప్రవహిస్తున్న స్థలంలో చేపలు పట్టడం గానీ, వాగులోకి దిగి వీడియోలు, సెల్ఫీలు తీసుకోవడం గానీ పూర్తిగా నిషేధించబడింది అని హెచ్చరించారు. పరకాల నుంచి హనుమకొండకు వెళ్లే ప్రయాణికులు కంఠాత్మకూర్ మార్గానికి బదులుగా, వయా సిద్ధాపూర్ – వంగపహాడ్ మీదుగా ప్రత్యామ్నాయ మార్గంలో ప్రయాణించాలని ఎస్సై కొంక అశోక్ సూచించారు.

## వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన



**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలో మొంథా తుఫాను వల్ల ఏర్పడిన పరిస్థితిని, వరద ప్రభావిత ప్రాంతాలను పరకాల ఆర్డీవో నారాయణ పరిశీలించారు. స్థానిక తహశీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవితో కలిసి ఆయన పర్యటించారు. ఆర్డీవో ముఖ్యంగా ఊరుగొండ నుంచి పసరగొండ గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలోని లో లెవల్ వంతెనను, ఊరుగొండ పెద్ద చెరువును పరిశీలించారు. నీటి ప్రవాహం, చెరువుల మట్టాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో నారాయణ మాట్లాడుతూ వర్షం తగ్గినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. అలాగే, గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రతి శాఖ అధికారి అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. అనంతరం తహశీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి ఒగ్లాపూర్‌లోని సాంఘిక సంక్షేమ, మహాత్మా జ్యోతిబా పూలే, మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు, వసతులకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు.

## పత్తి పంట వర్షార్పణం



**వరంగల్ వాయిస్, దామెర :** ఈ ఏడాది కురుస్తున్న భారీ వర్షాలు, ముఖ్యంగా మొంథా తుఫాన్ ప్రభావంతో పత్తి రైతులను నిండా ముంచేశాయి. వరుస వర్షాలు, వాతావరణంలో మార్పుల కారణంగా పత్తి పంట పూర్తిగా దెబ్బతిని, రైతులు చేతికి అందకుండా పోతున్న పంటను చూసి ఆగమవుతున్నారు. తరుచూ వర్షాలు, మబ్బులు, సరిపడా ఎండ లేకపోవడం వల్ల పత్తికాయలు పగలడం లేదు. కొన్ని చోట్ల కాయలు చెట్లపైనే కుళ్లిపోయి రాలిపోతున్నాయి. జూన్ మొదటివారంలో పంటలు వేసి, పత్తి ఏరిన చోట కూడా అది రంగు మారి నాణ్యత లేకుండా పోతున్నది. సాధారణంగా నవంబర్ చివర్లో కనిపించాల్సిన గులాబీ రంగు పురుగు (పింక్ బోల్‌వార్మ్) ఉధృతి ఈసారి అక్టోబర్‌లోనే మొదలైంది. దీని కారణంగా ఆకులు రాలి, చెట్లు మోడువారాయి. పచ్చగా ఉన్న చెట్లకు కాసిన పూత, కాత రాలిపోతున్నది. మొంథా తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు, చెట్లపైన కాసిన పత్తిని కూడా ఏరుకోలేని పరిస్థితి ఏర్పడింది. లేటుగా విత్తనాలు నాటిన రైతులకు తొలి క్రాప్ కూడా అందని దుస్థితి నెలకొంది. పురుగు మందులు కొట్టలేక, కిందపడిన పత్తిని ఏరడానికి కూలీల ఖర్చులు భరించలేక రైతులు చేతులెత్తేస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో చాలా చోట్ల పత్తి చేలను వదిలేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి ఖర్చులు తల్చుకొని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

## మొంథా తుఫాన్ బాధితులకు అండగా క్రెడాయ్ వరంగల్

### 1,500 మందికి అన్నదానం



**వరంగల్ వాయిస్, వరంగల్:** మొంథా తుఫాన్ కారణంగా నిరాశ్రయులైన ప్రజలకు అండగా నిలుస్తూ క్రెడాయ్ వరంగల్ సభ్యులు తమ సామాజిక బాధ్యతలో భాగంగా అన్నదానం, తాగునీటిని పంపిణీ చేశారు. క్రెడాయ్ వరంగల్ తమ సీఎస్ఆర్ నిధుల ద్వారా సుమారు 1,500 మంది తుఫాన్ బాధితులకు అన్నదానం, వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేసింది. 100 ఫీట్ రోడ్డు, పోతన నగర్ ప్రాంతాల్లో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. తుఫాన్ ప్రభావంతో కష్టాల్లో ఉన్న బాధితులకు సహాయం అందించడం ద్వారా సామాజిక బాధ్యతగా అండగా నిలిచామని క్రెడాయ్ వరంగల్ సభ్యులు పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో క్రెడాయ్ వరంగల్ ప్రెసిడెంట్ – నాయిని అమరేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ శాఖమూరి అమర్, చైర్మన్ తిరుపతి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎల్.రజనీకాంత్ రెడ్డి, కోశాధికారి వరుణ్ అగర్వాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు కొండా రెడ్డి, నాగరాజు, వెంకట మల్లా రెడ్డి, ఈసీ సభ్యులు మనోహర్, బాబు రావు, క్రెడాయ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ముంపు శాశ్వత పరిష్కారానికి వెయ్యి కోట్లు కేటాయించాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి
- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన సీపీఐ బృందం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ నగరంలోని ముంపు ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలని అందుకు ప్రభుత్వం వెయ్యి కోట్లు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మొంథా తుపాన్ ప్రభావంతో నీట మునిగిన నగరంలోని పలు ప్రాంతాలను సీపీఐ బృందం గురువారం సందర్శించింది. నగరంలోని హనుమకొండ బస్టాండ్, ములుగు రోడ్, హనుమాన్ నగర్, పలువేల్పుల, గోపాల్ పూర్, సమ్మయ్య నగర్, వరంగల్ లోని హంటర్ రోడ్ తదితర ప్రాంతాలను సీపీఐ నాయకులు సందర్శించి స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ముంపు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ ఏటా వర్షాకాలంలో భారీ వర్షాలకు వరంగల్ నగరం అతలాకుతలం అవుతున్నదని, లోతట్టు ప్రాంత కాలనీలతో సహా రోడ్లు అన్నీ నీట మునుగుతున్నాయని అన్నారు. ఈ సారి మొంథా తుపాన్ ప్రభావం కారణంగా అత్యంత భారీ వర్షాలు కురియడంతో వరంగల్,హనుమకొండ,కాజీపేట ట్రైసిటీస్ పూర్తిగా నీట మునిగి ప్రజలు ఇండ్లలో నుంచి బయటికి రాలేని పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. గతంలో వరంగల్ ను రెండవ రాజధానిగా చేస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు నగరాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని అన్నారు. ప్రతీ ఏటా కాలనీలు నీట మునుగుతున్నా గత ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం కోసం నిధులను కేటాయించలేదని, దాంతో అదే పరిస్థితి ప్రతి ఏటా పునరావృతం అవుతున్నదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా ముంపు ప్రాంతాల శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని, అందుకు రూ. 1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ సిటి, హెరిటేజ్ సిటీగా ప్రకటించిన కేంద్రం ప్రకటనలకే పరిమితం అయింది తప్ప నిధుల కేటాయింపులో సవతి తల్లి ప్రేమను కనబరుస్తూ వస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యదర్శి సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు అశోక్ స్టాలిన్, మునిగాల భిక్షపతి, ఏదునూరి వెంకట్రాజం, బాషబోయిన సంతోష్, బత్తిని సదానందం, గుంటి రాజేందర్, అలువాల రాజు, జూకంటి పద్మ, పొనుగోటి రాములు, గోపాల్ చారి, పూజారి అమృతయ్య, రమ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల వేళ రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

## మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, పంట నష్టాన్ని తగ్గించుకునేందుకు రైతులు సకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) శ్రీనివాస్ సూచించారు. చేతికొచ్చిన వరి, పత్తి, మిరప వంటి పంటలపై వర్ష ప్రభావం పడే అవకాశం ఉన్నందున, రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. పొలం మడులలో నీరు నిలవకుండా, వచ్చిన నీరు వచ్చినట్లుగా బయటకి వెళ్లే విధంగా పొలం గట్లకు గండ్లు పెట్టుకోవాలి. ఈదురు గాలుల వల్ల నేలవారిన వరి కంకులను నీటిలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షం తగ్గిన తర్వాత నేలవారిన వరిని పైకి లేపి కట్టుకోవడం వలన గింజ రంగు మారకుండా ఉంటుంది. కోత సమయంలో ఉన్న పంట తెగుళ్ల బారిన పడకుండా ఉండటానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ పిచికారి చేసుకోవాలి. బ్యాక్టీరియాకు సంబంధించిన తెగులు నివారణకు ఎకరానికి 200 లీటర్ల నీటిలో 200 మి.లీ ప్రొపికొనజోల్ కలిపి పిచికారీ చేసుకోవాలి. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటపై లీటరు నీటికి ఐదు గ్రాముల ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలి. ధాన్యం కనుక తడిచినట్లైతే, దానిని బాగా ఆరబెట్టుకోవాలి. నీరు నిలవకుండా: పూత, పిందె దశలో ఉన్న పత్తి పంట పొలంలో నీరు నిలవకుండా చూసుకోవాలి. వర్షం తగ్గిన వెంటనే పత్తిని ఏరవద్దు. చెట్టు మీద ఉన్న పత్తి మొత్తం ఆరిన తర్వాత మాత్రమే తీయాలి. తడిసిన పత్తిని ఏరినట్లయితే బూజు వచ్చి రంగు మారి, నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంటుంది. తీసిన పత్తిని పొడి ప్రదేశంలో, పాలిథిన్ కవర్ పైన మాత్రమే ఆరబెట్టుకోవాలి.మిర్చి పంటలో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.వర్షం తగ్గిన తర్వాత సూక్ష్మపోషకాలను అందించినట్లయితే ఎలాంటి ఇబ్బంది ఉండదని ఏఓ శ్రీనివాస్ తెలిపారు.

# అకాల వర్షాల నష్టపరిహారం చెల్లించాలి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీజేపీ జిల్లా నాయకులు, మాజీ ఎంపీటీసీ కుడికాల శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పర్వతగిరిలోని స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పంట నష్టానికి సంబంధించి ఈ క్రింది విధంగా పరిహారం చెల్లించాలని కోరారు. ఎకరాకు రూ. 30 వేలు, అరటి తోటకు ఎకరాకు రూ.50 వేలు, పత్తి పంటకు ఎకరాకు రూ.30 వేలు, కూరగాయల పంటలకు తగిన నష్టపరిహారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ప్రకటించాలని శ్రీధర్ కోరారు. అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజన పథకాన్ని తక్షణమే రాష్ట్రంలో అమలు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు



**వరంగల్ వాయిస్, పరకాల:** మొంథా తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సభ్యులు లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. కొయ్యడ శ్రీనివాస్ నాయకత్వంలో బృందం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన శ్రీనివాస కాలనీ, మమత నగర్, ఆంధ్ర బ్యాంక్, సీఎస్ఐ కాలనీ, భూపాలపల్లి రోడ్డులోని ఎంఆర్ రెడ్డి కాలేజీ ఎదురుగా గల నీటి నిల్వలను గుర్తించి, పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా కొయ్యడ శ్రీనివాస్ మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఎన్నికైన వెంటనే పట్టణంలోని డ్రైనేజీ సమస్యపై దృష్టి సారించారని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే పట్టణంలో వర్షాలు కురిసినప్పుడు ప్రజలు నానా ఇబ్బందులకు గురయ్యేవారని ఆయన అన్నారు. పట్టణంలో డ్రైనేజీ సమస్య ఉండడం వలనే లోతట్టు ప్రాంతాలు మునుగుతున్నాయని గుర్తించిన ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.30 కోట్లతో వార్డులలో డ్రైనేజీ వ్యవస్థను నిర్మిస్తున్నారని తెలిపారు. ఈరోజు ఈ డ్రైనేజీల నిర్మాణం వల్లనే పరకాల పట్టణంలో ఉన్న ప్రజలందరూ సురక్షితంగా ఉన్నారని, లేకుంటే ఈపాటికి ఈ వర్షం దాటికి ముప్పు వాటిల్లేదని పేర్కొన్నారు. పరకాల పట్టణాన్ని సుందరంగా అభివృద్ధి చేయడమే ఎమ్మెల్యే ఏకైక లక్ష్యంగా ముందుకు పోతున్నారని ఆయన స్పష్టం చేశారు. వర్షం నీరు ఇళ్లలోకి వచ్చిన కుటుంబాలను నాయకులు కలిసి, వారికి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యేతో మాట్లాడి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దెబ్బతిన్న ఇళ్లకు త్వరలో ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మడికొండ శ్రీను, చందుపట్ల రాఘవరెడ్డి, పసుల రమేష్, దార్న వేణుగోపాల్, మెరుగు శ్రీశైలం, బండి సదానందం, పోరండ్ల వేణు, ఒంటెరు శ్రావణ్, గడ్డం శివ, మంద నాగరాజు, బొమ్మకంటి రుద్రమ చంద్రమోళి, బొచ్చు మోహన్, సూదమల్ల కిషోర్ పాల్గొన్నారు.

# ఆపదలో అండగా ఉంటా

## కార్పొరేటర్ మామిండ్ల రాజు



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట :** ఆపదలో అండగా ఉంటానని ముంపు ప్రాంతాల ప్రజలకు 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు భరోసాఇచ్చారు. 31వ డివిజన్ లోని ముంపు ప్రాంతాల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశానుసారం హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరిష్ సహకారంతో వరదల్లో చిక్కుకున్న కాలనీలకు ఆహార పొట్లాలను కార్పొరేటర్ రాజు పంపిణీ చేశారు. ఎంతటి ఆపద వచ్చినా .. ఓ అన్నగా మీకు అండగా ఉంటానని.. డివిజన్ ప్రజలు ఎలాంటి అధైర్య పడవద్దని కాలనీలలో వరద సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. వర్షం తగ్గిన కూడా వరద ఉధృతి అలాగే ఉందని మీకు ఏ సహకారం కావాలన్నా తనకు నేరుగా ఫోన్ చేయాలని కార్పొరేటర్ కోరారు. అధికార యంత్రాంగ డిప్యూటీ కమిషన్ రవీందర్ కాజీపేట తహ సిల్దార్ ఇస్లావత్ భావు సింగ్, సుబేదారి సర్కిల్ ఇన్ స్పెక్టర్ రంజిత్ కుమార్, మున్సిపాలిటీ సానిటరీ ఇన్ స్పెక్టర్ టి.అనిల్, డీఆర్ఎఫ్ రిస్క్ టీం, మున్సిపాలిటీ వర్కర్స్ ఎప్పటికప్పుడు ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ సహా యక చర్యల్లో పాల్గొంటున్నారన్నారు. వరద ఉధృతి తగ్గేవరకు కరెంటు స్తంభాలను ముట్టుకోవద్దని, చిన్న పిల్లలను బయటకి రాకుండా చూసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు

# మత్తడి ఉధృతికి 110 గొర్రెలు మృతి



**వరంగల్ వాయిస్, నర్సెంపేట:** భారీ వర్షాల కారణంగా చెరువు మత్తడి ఉధృతమై, మండలంలోని వెల్దండ గ్రామంలో సుమారు 110 గొర్రెలు గల్లంతై మృతిచెందిన విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనతో గొర్లకాపర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వెల్దండ గ్రామానికి చెందిన పంతెంగి చంద్రమౌళి తన 110 గొర్రెలను, వడాల పెద్దపురంకు చెందిన 150 గొర్రెలను తీసుకుని గంటెమ్మ చెరువు సమీపంలోకి వెళ్లారు. వర్షం ఎక్కువై చెరువులు నిండిపోయాయి. ఈ క్రమంలో సాయంత్రం తమ గొర్రెలను ఇంటికి తీసుకువస్తుండగా, గంటెమ్మ చెరువు మత్తడి ఉధృతమై గొర్రెలు అన్ని ఒక్కసారిగా మత్తడిలో కొట్టుకుపోయాయి.గురువారం ఉదయం గ్రామస్తులు మృతిచెందిన గొర్రెలను బయటకు తీసి రెవెన్యూ, వెటర్నరీ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన వెటర్నరీ వైద్యుడు జితేందర్ మృతిచెందిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. తమ జీవనాధారమైన గొర్రెలు మృతి చెందడంతో, తమకు సుమారు రూ. 10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు బోరున విలపించారు. ప్రభుత్వం తక్షణమే తమను ఆదుకోవాలని బాధితులు కన్నీటితో వేడుకున్నారు. నష్టపోయిన గొర్లకాపర్లకు నష్టపరిహారం అందించాలని కోరుతూ గొర్లకాపర్ల సంఘం సభ్యులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

# ఘనంగా రెహమాన్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మహబూబాబాద్ జిల్లా భాజపా మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఎస్.కే.రెహమాన్ పుట్టినరోజు వేడుకలు డోర్నకల్ పట్టణంలో భాజపా కార్యకర్తలు, నాయకులు, అభిమానుల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, అభిమానులు రెహమాన్‌తో కలిసి కేక్ కట్ చేసి సంబరాలను ప్రారంభించారు. ఆయనకు మిఠాయిలు తినిపించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో మల్లికార్జున్, లక్ష్మీనారాయణ, దాస్, హర్షవర్ధన్, శేఖర్, రాంకుమార్, రవి, మహేష్, ఉపేందర్, రాజేష్, మనోహర్, జలంధర్, బిందు కుమార్, కిషోర్, గఫూర్, జన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

■ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి




**వరంగల్ వాయిస్, పరకాల:** మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంట నష్టాన్ని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. నడికూడ, దామెర మండలాల పరిధిలోని ఊరుగొండ గ్రామంలో వరి మరియు పత్తి పంటల పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పంట నష్టానికి గల కారణాలను రైతుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చే దశలో రైతులు నష్టపోవడం బాధాకరమని అన్నారు. నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టితో పనిచేసి, ప్రతి రైతు యొక్క పంట నష్టాన్ని కచ్చితంగా అంచనా వేయాలని ఆయన ఆదేశించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ నారాయణ, ఎంఆర్వో జ్యోతి వరలక్ష్మి దేవి, ఆర్ఐ భాస్కర్ రెడ్డి సహా ఇతర మండల అధికారులు ఈ పర్యవేక్షణలో ఉన్నారు. అలాగే మండల పార్టీ అధ్యక్షులు మన్నెం ప్రకాష్ రెడ్డి, సీనియర్ నాయకులు గుడిపాటి శ్రీధర్ రెడ్డి, శనిగరం సుధాకర్, దుబాసి రాజేందర్, కునమల రవీందర్, బింగి రాజేందర్, కిరణ్, పోలేపాక భిక్షపతి, పుచ్చకాయల లింగారెడ్డి, దండు విజేందర్, పోతరాజు భిక్షపతి, ముత్యాల కరుణాకర్, గండు కిషోర్, మేకల రవీందర్ పాల్గొన్నారు.

# 'ఆబ్ట్యూస్ యాంగిల్' కార్టూన్ పుస్తకావిష్కరణ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య రాసిన "ఆబ్ట్యూస్ యాంగిల్" అనే కార్టూన్ పుస్తకం కొత్త ఎడిషన్‌ను మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వైష్ణవ్ బండారు ఫౌండేషన్ ఎఫ్ టీసీసీఐలో సివిల్ సర్వీసెస్, జాతీయ సమైక్యతపై ఒక ఇంటరాక్టివ్ సెషన్‌ను ఏర్పాటు చేసింది. దీనికి అనేక మంది ప్రముఖ మాజీ సివిల్ సర్వెంట్లు, మాజీ డీజీపీలు, సి.ఆంజనేయ రెడ్డి, ఏకే మహంతి, అరుణ బహుగుణ, రాజేంద్ర కుమార్, మాజీ ఐఏఎస్ అధికారులు బీపీ ఆచార్య, అజయ్ మిశ్రా, నిర్మల గోనెల తదితరులు హాజరయ్యారు. జాతీయ సమైక్యత,అఖిల భారత సేవలను సృష్టించడంలో సర్దార్ పటేల్ పాత్రకు ఘనమైన నివాళులు అర్పించారు.




# బాధితులకు న్యాయ సేవాధికార సంస్థ సాయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 'మొంథా' తుఫాను ప్రభావంతో వరంగల్ జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా నిరాశ్రయులైన ప్రజలకు న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ ద్వారా తక్షణ సహాయక చర్యలు అందించారు.కరీమాబాద్, ఉర్సుగుట్ట ప్రభుత్వ పాఠశాలల్లో ఆశ్రయం పొందుతున్న వారికి, అలాగే హంటర్‌రోడ్‌లోని బీట్ బజార్ ప్రాంతంలో ఉన్న బాధితులకు న్యాయ సేవాధికార సంస్థ తరఫున పాలు, 800 పులిహోర ప్యాకెట్లు, మరియు 1000 మంచినీటి ప్యాకెట్లను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదను కలిసి, వరదలలో చిక్కుకున్న వారికి కల్పించే సౌకర్యాలను, తీసుకుంటున్న సహాయక చర్యలను అడిగి తెలుసుకున్నారు. ముంపునకు గురైన ప్రాంతాలను వెంటనే గుర్తించి, అందరికీ సహాయ సహకారాలు అందించాల్సిందిగా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారు అధికారులకు సూచించారు. వరద బాధితులు ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తితో పాటు, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. సాయి కుమార్, కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్ ప్రీత్ సింగ్, పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

## అధికారుల వైఫల్యంపై సీపీఐ మండిపాటు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నిన్నటి భారీ తుఫాను వర్షం కారణంగా వరంగల్ నగరంలోని హంటర్ రోడ్, న్యూ శాయంపేట సహా అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. దీనికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యుఎంసీ) అధికారుల వైఫల్యం, రాజకీయ పాలకుల నిర్లక్ష్యమే కారణమని సి.పి.ఐ కాజీపేట మండల సమితి తీవ్రంగా మండిపడింది. బొందువాగు పరిసర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాల కారణంగానే వర్షపు నీరు నిలిచిపోయి, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని సీపీఐ నేతలు పేర్కొన్నారు. ప్రజలు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి 5-6 కి.మీ.లు అదనంగా ప్రయాణించాల్సి రావడం సాధారణ జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. సమయానికి ముందస్తు చర్యలు చేపట్టి, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరిచి ఉంటే ఈ స్థాయి నష్టం తలెత్తేది కాదని పార్టీ నేతలు విమర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సీపీఐ కాజీపేట మండల సహాయ కార్యదర్శి వేల్పుల సారంగపాణి యాదవ్, సీనియర్ నాయకులు మునీగాల బిక్షపతి, ఏ.ఎస్.ఎఫ్.ఐ మండలం ఇంచార్జ్ వేల్పుల చరణ్ తదితరులు ప్రభావిత ప్రాంతాలను సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సీపీఐ కాజీపేట మండల సమితి డిమాండ్ చేసింది.




# హరీశ్ రావు తండ్రి మృతిపై సాంబారి సమ్మారావు సంతాపం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు తండ్రి సత్యనారాయణ రావు మృతి పట్ల బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాంబారి సమ్మారావు మాట్లాడుతూ సత్యనారాయణ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని కోరుకున్నారు. అలాగే, హరీశ్ రావు, వారి కుటుంబసభ్యులకు ఈ కష్ట సమయంలో మనోధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థించారు.

# భారతీయ కళాకార్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సాగంటి మంజుల



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రముఖ చిత్రకారిణి, సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎల్.బీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ సాగంటి మంజుల భారతీయ కళాకార్ సంఘ్ (బీకేఎస్) తెలంగాణ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. అక్టోబర్ 28, 29 తేదీల్లో ఉత్తరప్రదేశ్లోని ఝాన్సీలో జరిగిన భారతీయ కళాకార్ సంఘ్ జాతీయ సమావేశానికి హాజరైన మంజులకు, ఆమె చిత్రకళా పటిమను, సేవను గుర్తించి జాతీయ స్థాయి చిత్రకారుల సంస్థ అయిన బీకేఎస్‌లో తెలంగాణ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా పదవి బాధ్యతలు అప్పగించారు.సంస్థ వ్యవస్థాపకులు అంకూర్, జాతీయ అధ్యక్షుడు కుమార్, యూపీ అధ్యక్షులు పాలన్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి. రాము ఆధ్వర్యంలో వేలాది మంది చిత్రకారుల సమక్షంలో ఆమెకు నియామక పత్రం అందజేసి, సన్మానం చేశారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సేవలు అందించాలి

◆ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య ఆదేశం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** మొంథా తుఫాను ప్రభావంతో ముంపునకు గురైన ప్రాంతాల్లో వైద్య సేవలు ముమ్మరం చేయాలని హనుమకొండ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ.అప్పయ్య వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. గురువారం డాక్టర్ అప్పయ్య లష్కర్ సింగారం, పోచమ్మ కుంట ప్రాంతాల్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు, ముంపు ప్రభావానికి గురైన ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అవసరమైన చోట వైద్య శిబిరాలు నిర్వహించి తక్షణ సేవలు అందించాలి.వరద తగ్గిన వెంటనే ఆయా ప్రాంతాలను సందర్శించి తగిన వైద్య సేవలు అందించాలి. ప్రజలకు ఆహారం, త్రాగునీటికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. అనంతరం జిల్లాలోని వైద్యాధికారులతో ఆయన జూమ్ సమావేశం నిర్వహించి ముఖ్యమైన ఆదేశాలు జారీ చేశారు.ప్రసవ సమయం దగ్గరగా ఉన్న గర్భిణీ స్త్రీల జాబితా తమ వద్ద ఉంచుకుని, ఆశాలు, ఏఎన్ఎంలు వారితో నిరంతరం కాంటాక్ట్‌లో ఉండాలి. ప్రభావిత ప్రాంతాల్లోని హాస్టళ్లను సందర్శించి, అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలి. కార్పొరేషన్ మరియు పంచాయతీ సిబ్బందితో సమన్వయంతో పని చేయాలి.ప్రజలు అత్యవసర వైద్య సేవల నిమిత్తం 108, గర్భిణీ స్త్రీలు, పిల్లల కోసం 102 వాహన సేవలను వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే, వేడివేడి ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలని, త్రాగునీటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.




# మహాకాళిగా

## కన్నడ నటి భూమిశెట్టి

తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి ప్రతి ఏడాది ఓ సినిమా వస్తుందని ప్రశాంత్ వర్మ చెప్పిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా రానున్న మూడో సినిమా 'మహాకాళి'. ఫీమేల్ సూపర్ హీరో చిత్రంగా ముస్తాబవుతోంది. దీనికి ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా ఈ చిత్రంలో మహాకాళిగా కన్నడ నటి భూమి శెట్టి నటించనున్నట్లు తెలిపారు. 'విశ్వంలోనే అత్యంత శక్తిమంతమైన సూపర్ హీరోలు రానున్నారు' అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. భూమి శెట్టి ఇటీవల 'కింగ్డమ్'లో కనిపించిన విషయం తెలిసిందే. అందులో సత్యదేవ్ భార్యగా ఆమె అలరించారు. ఇక 'మహాకాళి' షూటింగ్ ఇప్పటికే 50 శాతం పూర్తయినట్లు సమాచారం . ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో చిత్రీకరణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా నటిస్తున్నారు. గతంలో ఈ సినిమా గురించి ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ.. మా యూనివర్స్‌కు కొత్త శక్తి జోడైంది. అత్యంత భయంకరమైన చెడుపై యుద్ధం చేయడానికి కాళికాదేవి స్వరూపం రానుంది. సూపర్ హీరోలు ఎలా ఉంటారో ఈ చిత్రంలో చూపించనున్నాం అని అన్నారు. ఈ యూనివర్స్‌లో భాగంగా ఇటీవల 'అధీర'ను ప్రకటించారు. ఎస్‌జే సూర్య, కల్యాణ్ దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్లు తెలిపారు. ఈ సూపర్ హీరో ఫిల్మ్‌కు శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించనున్నారు.

# కొత్త సినిమా విశేషాలు పంచుకోనున్న రాజమౌళి

### రాజమౌళి మహేశ్‌బాబు కాంబో

రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా ఒక సినిమా రూపొందుతోంది. ఇంకా పేరు పెట్టని ఈ సినిమాని 'ఎస్ఎస్ఎంబి 29' అని, గ్లోబ్ ట్రాట్టింగ్ మూవీ అని రకరకాలుగా పిలుస్తున్నారు. అయితే ఈ సినిమాకి సంబంధించిన పూజా కార్యక్రమం చాలా సీక్రెట్‌గా జరిపించారు రాజమౌళి. హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో వేసిన సెట్లో చాలా సీక్రెట్‌గా, పగడ్బందీగా ఓపెనింగ్ జరిపి, ఆ రోజు నుంచే కొన్నాళ్లపాటు షూటింగ్ కూడా జరిపారు. ఇటీవలే ఒక షెడ్యూల్ షూటింగ్ కోసం కెన్యా కూడా వెళ్లి వచ్చింది టీమ్. ఇప్పుడు ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, నవంబర్ 15వ తేదీన హైదరాబాద్ వేదికగా ఈ సినిమాకి సంబంధించి ఒక పెద్ద ఈవెంట్ నిర్వహిస్తున్నారు రాజమౌళి. కే.ఎల్. నారాయణ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమా ఈవెంట్‌లో సినిమాకి సంబంధించిన అనేక విషయాలను వెల్లడిరచే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా రాజమౌళి తన సినిమాలు మొదలుపెట్టేముందు ఒక ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, సినిమా ఎలా ఉంటుందో ముందే చెప్పేస్తారు. కానీ ఈ సినిమా విషయంలో మాత్రం చాలా జాగ్రత్తలు తీసుకుంటూ వస్తున్నారు. అయితే ఇప్పుడు ఈవెంట్ నిర్వహించడానికి కారణం ఏంటి అనేది మాత్రం తెలియదు. నవంబర్ 15వ తేదీ జరగాల్సిన ఈవెంట్‌కు సంబంధించి ఇప్పటినుంచే ఏర్పాట్లు ప్రారంభమైనట్లుగా సమాచారం




# నేడు బాహుబలి: ది ఎపిక్ విడుదల

### □ బాహుబలి 3పై ప్రేక్షకుల్లో ఉత్కంఠ

తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన 'బాహుబలి: ది బిగినింగ్' , 'బాహుబలి: ది కన్‌క్లూజన్ సినిమాలు ఇప్పుడు ఒకే వెర్షన్‌గా 'బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' టైటిల్‌తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీమియర్స్ గురువారం రాత్రి నుంచే ప్రారంభం కానుండగా, అన్ని ఫార్మాట్లలో సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. కొద్ది రోజులుగా ' బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' చివర్లో బాహుబలి 3 పై ప్రకటన ఉంటుందంటూ ప్రచారం జోరుగా సాగింది. అయితే, నిర్మాత శోభు యార్లగడ్డ ఇప్పటికే ఈ రూమర్లపై క్లారిటీ ఇచ్చారు. బాహుబలి 3 ప్రాజెక్ట్ గురించి ఇంకా చాలా వర్క్ చేయాల్సి ఉందని, ప్రస్తుత ఎడిట్‌లో అలాంటి ఎలాంటి ప్రకటన లేదని ఆయన స్పష్టం చేశారు. బాహుబలి 3 ప్రస్తావన లేకపోయినా, ఓ సర్ప్రైజ్ మాత్రం ఉండవచ్చని శోభు ఇటీవలే సూచించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. అదేంటో తెలుసుకోవడానికి అందరూ ఎదురు చూస్తుండగా, ఇప్పుడు రాజమౌళి పరోక్షంగా దానిపై క్లారిటీ ఇచ్చినట్లు కనిపిస్తోంది.




# నా నటనకు రిటైర్మెంట్ లేదు

### □ మాస్ జాతర హీరో రవితేజ

'మాస్ జాతర' అంటూ ఆడియన్స్‌ను అలరించడానికి సిద్ధమయ్యారు హీరో రవితేజ. భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో రవితేజ ప్రచారం జోరు పెంచారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు తెలిపారు. నటనకు రిటైర్మెంట్ తీసుకోను. నా చివరి శ్వాస వరకూ నటిస్తూనే ఉంటాను. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోను. అందుకే అవి నన్ను ప్రభావితం చేయవని రవితేజ తెలిపారు.ఈ సినిమా కొంచెం ఆలస్యమైంది. దీని చిత్రీకరణలో నాకు కొన్ని గాయాలు అయ్యాయి. వాటి కారణంగానే చాలాసార్లు వాయిదా పడిరది. సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నాం, తర్వాత వేసవిలో రావాలనుకున్నాం, వినాయక చవితికి రిలీజ్ చేద్దాం అనుకున్నాం.. ఆ తేదీలేవీ కుదర్లేదు. ఇన్ని రోజులకు విడుదల చేస్తున్నాం. ఇదే సరైన సమయమని అనుకుంటున్నా. ఏది జరిగినా మన మంచికే. నా కెరీర్‌లో సినిమా ప్రారంభించిన తర్వాత ఇంత ఆలస్యం ఎప్పుడూ కాలేదు. మొదటిసారి ఇలా జరిగిందన్నారు. జయాపజయాలను నేను పట్టించుకోను. నా పని చేస్తూ వెళ్తాను. ఎవరికైనా నేను ఇచ్చే సలహా ఇదే. మన పనిని వందశాతం కష్టపడి చేస్తూ వెళ్తే ఏదో ఒకరోజు దానికి తగిన ఫలితం వస్తుందని నమ్ముతాను. ఆత్మవిశ్వాసం తగ్గిపోతే ఏదీ సాధించలేరు. అన్నిటికంటే మనపై మనకు నమ్మకం ముఖ్యం.



# అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ముంపు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పర్యటన
- డ్రోన్ ద్వారా ఆహార పదార్థాల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడొద్దని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి జల మయమైన ఎన్ఎన్ నగర్, బీఆర్ నగర్ ప్రాంతాల్లో మంత్రి లోక్ సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి క్షేత్ర స్థాయిలో వరద ప్రాంతాలను సందర్శించి, బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసాయన్నారు. దీంతో ఎన్ డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ ల ద్వారా సహాయక చర్యలు చేపడుతున్నామన్నారు. గత 5 సంవత్సరాలనుంచి ముంపు పరిస్థితి తలెత్తుతోందన్నారు. నగర పరిధిలో లోతట్టు ప్రాంతాలు ఉండడం, కొన్ని ప్రాంతాలు కబ్జాకు గురి కావడం, సరైన వెడల్పుతో నాలాలు ఉండకపోవడం ఇందుకు కారణమన్నారు. ఇకముందు ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాల వల్ల ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడవద్దని ఇందుకోసం ముఖ్యమంత్రి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, వారి ఆదేశం మేరకు ముందుకు వెళతామని మంత్రి తెలిపారు. వరద ప్రభావం దృష్ట్యా గత రాత్రి నుంచి జిల్లా కలెక్టర్ తో పాటు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చడానికి మన వద్ద అందుబాటులో ఉన్న డీఆర్ఎఫ్ బృందాలకుతోడు ఎన్ డీఆర్ఎఫ్ బృందాలను కూడా పిలిపించామన్నారు. ఆయా డివిజన్ లకు చెందిన కార్పొరేటర్లు కూడా రాత్రి నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. కాలనీలలోని వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని పడవల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించి ఆవాసం అందిస్తున్నామన్నారు. వరదతో జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. వరద వల్ల నిరాశ్రయులైన వారికి తాత్కాలికంగా వరంగల్ ప్రాంతంలో తొమ్మిది పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు సుమారు 700 మందిని తరలించినట్లు, వరద నీటి నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేని వారికి డ్రోన్ ల ద్వారా ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సారి వరద ప్రభావానికి గురయ్యే ప్రాంతాల వాసులకు ఇందిరమ్మ ఇళ్లను అందించి ఆ ప్రాంతాలను ఖాళీ చేయించేలా చూస్తామని, ప్రస్తుత పరిస్థితి నేపథ్యం లో రెండు రోజులు సెలవులు ప్రకటించామని, ప్రజలు కూడా అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని ముఖ్యమంత్రి తో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం ఉందని వరంగల్ లో వరద పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని పునరావస కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న బాధితులకు పౌష్టికాహారం మంచినీటితో పాటు దుప్పట్లను కూడా అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్య రాణి కార్పొరేటర్ పల్లం పద్మ రవి, డీఏఓ అనురాధ, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు. వరదలతో సర్వం కోల్పోయిన వారికి టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ ఆధ్వర్యంలో ఆహారపు పొట్లాలను అందించారు.





## సేవలు బాగున్నాయ్..

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బజాజ్ అలెన్జ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సేవలు బాగున్నాయి. సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తికి చెందిన టీఎస్ 03 FF 7579 కియా వాహనం సెల్లార్ లో పార్కు చేయగా నిన్న కురిసిన భారీ వర్షానికి నీట మునిగింది. ఈ వాహన యజమాని కేశవమూర్తి బజాజ్ అలింజ్ ద్వారా జనరల్ ఇన్సూరెన్స్ చేయించారు. వాహనం నీట మునిగిన విషయాన్ని ఇన్సూరెన్స్ కంపెనీ వారికి తెలియజేయడంతో సూపర్వైజర్ మహేందర్ రెడ్డి స్పాట్ కు వచ్చి సేవలు అందించారు. ఫోటోలు తీసుకోవడంతో పాటు నీట మునిగిన వాహనాన్ని బయటికి తీసే వరకు అక్కడే ఉండి సహాయ సహకారాలు అందించారు. ఇన్సూరెన్స్ వారు సకాలంలో స్పందించినందుకు వాహన యజమాని కేశవమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.



## శాశ్వత పరిష్కారం చూపండి

- జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్
- కమిషనర్ కు వినతి

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని అండర్ బ్రిడ్జి ప్రాంతంలో వరద, మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కు వినతి పత్రం అందజేశారు. గురువారం 34 వ డివిజన్ లోని శివనగర్, పెరుకవాడ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. భారీ వర్షాల దృష్ట్యా మంత్రి కొండా దంపతులు స్థానిక ప్రజలకు అండగా ఉంటారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా స్పందించిన కమిషనర్ తక్షణ చర్యలకు అధికారులను ఆదేశించినట్లు శామంతుల శ్రీనివాస్ తెలిపారు.



## 20 కుటుంబాలకు ఆర్థిక సాయం

- కూరగాయల మార్కెట్ వర్తక సంఘం ఆధ్వర్యంలో చేయూత

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కూరగాయల మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు జారతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం వివిధ కారణాలతో మృతి చెందిన 20 మంది మార్కెట్ వ్యాపారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుంచి మార్కెట్ లో సేవలందించిన కుటుంబాలకు ఒక రోజు టెండర్ పెట్టి వచ్చిన డబ్బులను వ్యాపారస్తులు, గుమాస్తాలు, హమాలి కార్మికులకు సహాయం చేయడం జరుగుతుందని అన్నారు. మార్కెట్ లో ఉన్న వ్యాపారుస్తులందరం ఒకరోజు టెండర్ తో కొంతమంది వ్యాపారం చేసి వచ్చిన ఆదాయాన్ని ఆర్థిక సహాయంగా ఇవ్వడం జరిగిందన్నారు. దీని వలన రైతులకు గాని వినియోగదారులకు గాని ఇబ్బంది కలగకుండా ఒక్క వ్యాపారస్తులు కొంతమంది వ్యాపారం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఇవ్వడం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, మంత్రి కొండా సురేఖ ఆదేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ప్రధాన కార్యదర్శి గులాం సర్వర్ మున్నా, కార్పొరేటర్ చింతాకుల అనిల్, సోమిశెట్టి ప్రవీణ్, కాంగ్రెస్ టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ బాబు, కోశాధికారి మల్లూరి బాబురావు, గౌరవ సలహాదారులు ఎంఏ బాబు, కాసర్ల రాజు, పిన్న మల్లేశం, పర్షవీరన్న, బొజ్జ శ్రీహరి, ఉగ్గే యుగేందర్, చేర్ల కుమార్, కొండా హరి, రాయిశెట్టి శ్రీనివాస్, హమాలీ కార్మికులు చీకటి కుమార్, సాంబయ్య, సారయ్య, రవి, మొగిలి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు రాకేష్ రెడ్డి అండ

- ముంపు ప్రాంతాల్లో పర్యటన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మొంథా వరద బీభత్సంతో గ్రేటర్ వరంగల్ పరిధిలోని అనేక కాలనీలు జలమయమయ్యాయని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి అన్నారు. గురువారం పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఏనుగుల రాకేష్ రెడ్డి ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. హనుమకొండ లోని కాపువాడ, అదాలత్, జులై వాడ, అమరావతి నగర్, సమ్మయ్య నగర్, ప్రగతి నగర్, డ్రైవర్స్ కాలనీ, కుమార్ పల్లె, మార్కెట్, బొక్కల గడ్డ, హనుమకొండ చౌరస్తా, గుండ్ల సింగారం పునరావాస కేంద్రం, రామన్నపేట, హంటర్ రోడ్డులో ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడి నీటిలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వారికి కావాల్సిన ఆహార పదార్థాలు, మంచినీటిని అందించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com